తేదీ. 13-03-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

# సుఖ, శాంతులతో జీవించాలనుకునే మానవుడు ఇంద్రియ నిగ్రహమును పాటించాలి

సామాన్యముగా శాస్త్ర విచారంలో 'శమ' 'దమ' పదములు మనము వింటూ వుంటాము. శమము అంతరింద్రియ నిగ్రహమని; దమము, బహిరింద్రియ నిగ్రహమని లోకరీతి. నిజానికి, శమము అంతర్, బహిరింద్రియములు రెండింటియొక్క నిగ్రహము. ఇంద్రియములలో నేత్రము, శ్రోత్రము, జిహ్వ ప్రధానమైనవి. ఇవి ఒకదాని నొకటి అనుసరించటానికి ప్రయత్నిస్తాయి. నేత్రము చూడగానే శ్రోత్రానికి వినాలనిపిస్తుంది. శ్రోత్రము విన్న తక్షణమే నేత్రము ఆదృశ్యాన్ని పరికించటానికి ప్రయత్నిస్తుంది. విన్న విషయాన్ని దృశ్యముగా సృష్టించుకుంటుంది.

**సర్వేంద్రియాలకు మనస్సే అంతర్వాహినిగా ఉంటుంది**

ఐతే, ఇంద్రియాలేవీ స్వశక్తితో కూడుకున్నవి కావు. ఇవి ఉపకరణాలు మాత్రమే! వీటన్నింటికి మూలాధారమైనది, మనస్సు. మనస్సే జగత్తును సృష్టించుకుంటుంది. తన సంకల్పాలకు ఒక రూపము కల్పించుకుంటుంది. నేత్రము, శ్రోత్రము, ఉపకరణాలనటానికి ఆధారమేమిటో పరిశీలిద్దాము. జాగ్రదవస్థలో నేత్రము చూస్తుంది, శ్రోత్రము వింటుంది, జిహ్వ మాట్లాడుతుంది. ఐతే స్వప్నములో నేత్రము, శ్రోత్రము, జిహ్వ యివేవీ తమ పనులను చేయలేవు. స్వప్నములో చూచేది మనస్సు. మాట్లాడేది మనస్సే! అన్ని యింద్రియాలలో పనిచేసేది మనస్సే! సర్వేంద్రియాలకు మనస్సే అంతర్వాహిని.

మనో నిగ్రహము లేకపోతే మానవుడు క్షణమైన శాంతిని అనుభవించలేడు. శాంత జీవనము, సంతోష జీవనము గడుపగోరిన మానవుడు యింద్రియ నిగ్రహమును అత్యవసరముగా పాటించాలి. ఈనాటి మానవునికి శాంతి, సంతోషములు అతి దూరము కావటానికి కారణము, యింద్రియ నిగ్రహము లేకపోవటమే! ఈ యింద్రియములు ఒకదానికంటె ఒకటి తేలికై, విశాలమై తిరుగుతుంటాయి. మానవుడు పంచేద్రియములతో కూడినవాడు.

sri sathyasaivachanamrutam

వీటి తన్మాత్రలే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు. పంచేంద్రియాలకు పంచభూతాలు ఆధారంగా వున్నాయి. పృధ్వి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము పంచభూతములు. జలము, పృధ్వికంటె సూక్ష్మమై, విశాలమై వుంటుంది. అగ్ని, జలముకంటె సూక్ష్మమై, విశాలమై వుంటుంది. గాలి, అగ్నికంటె సూక్ష్మమై, విశాలమై సంచరిస్తుంది. ఆకాశము, గాలికంటె అతి సూక్ష్మమై, సర్వత్రా వ్యాపించి వుంటుంది. ఒకదానికంటె ఒకటి సూక్ష్మత్వము, విశాలత్వము పొందుతుంది. ఉన్నత స్థాయికి పోయేకొద్దీ సూక్ష్మ, విశాల రూపము ధరిస్తుంది. దిగువ స్థాయికి వచ్చే కొద్దీ స్థూల, ఘన స్వరూపము దాలుస్తుంది. ఆకాశము కంటె గాలి, గాలి కంటె అగ్ని, అగ్ని కంటె జలము స్థూల స్వరూపము లేక ఘన స్వరూపము కలిగి వుంటాయి. జలముకంటె భూమి మరింత ఘనము.

**ఆకాశమే పంచభూతములకు ఆధారము**

అన్నింటికిని ఆకాశమే మూలాధారము. అవకాశము నందింపచేది, ఆకాశము. అది ఒక పెద్ద కుండవంటిది. అచటినుండే నాలుగు భూతాలు ఆవిర్భవిస్తున్నాయి. చలనమునుండి గాలి ప్రారంభమవుతుంది. గాలి, అగ్నిని సృష్టిస్తుంది. గాలి లేకున్న అగ్ని లేదు. అగ్నియొక్క వేడిచేత జలము ఉత్పన్నమవుతున్నది. దేహములో అత్యధిక ఉష్ణోగ్రత యేర్పడి తగ్గే సమయంలో జలము ఉద్భవిస్తుంది. ఎండలో ప్రయాణము చేసినప్పుడు దేహమంతా చెమట పడుతుంది. ఈ విధంగా వేడినుండి జలము పుట్టవిస్తుంది. జలముయొక్క ఘనీభావ స్థితియే ప్రకృతి. అనగా జలమే ఘన పదార్థముగా మారిపోతుందన్నమాట! ఇదే విశాల ప్రకృతిగా రూపొందుతుంది. ఒక ఉదాహరణము. గదిలో బల్లపైన ఒక మల్లెపూవు పెట్టాము. దాని పరిమళము గదంతా వ్యాపించింది. మల్లెపువ్వు ఆక్రమించిన ప్రదేశము చాలా చిన్నది. కాని దానినుండి వెలువడే సుగంధము ఆక్రమించిన ప్రదేశము చాలా విశాలము. మల్లెపువ్వు ఘనమైంది. పరిమళము సూక్ష్మమైనది. అదే విధముగా ఆవిరి, చెమ్మకంటె జలము అధిక ప్రదేశమును ఆక్రమిస్తుంది. సూర్యరశ్మి జలముకంటె అధిక ప్రదేశమును ఆక్రమిస్తుంది.

**వాంఛలు తగ్గించుకున్నకొలది మనస్సు విశాలతను పొందుతుంది**

sri sathyasai vachanamrutam

మానవుని తెలివితేటలు, మనస్సు, స్వభావము సూక్ష్మ స్వరూపము ధరించినప్పుడు విశాలత్వాన్ని సంతరించుకుంటాయి. మనస్సు, ఇంద్రియాలద్వారా అనేక విషయ వాసనలు, వస్తువులచేత ఆకర్షింపబడుతుంది. వస్తు సంబంధము అధికమయ్యేకొద్దీ మనసు విశాలత క్షీణిస్తూ పోతుంది. వాంఛలు తగ్గించుకున్నప్పుడే మనస్సు విశాలతను పొందుతుంది. మానవుడు జగత్తులో కట్టుబడి, బంధితుడై అశాంతిని అనుభవించటానికి కారణము యేమిటి? విషయ సమ్మిళితమైన తత్త్వ సేకరణ అధికముగా చేయటమే, అశాంతికి కారణము. ప్రపంచానికిగాని, సంసారానికిగాని బంధించబడటానికి మనస్సుకు కాళ్లు, చేతులు లేవు. ప్రకృతిమీద అభిమాన, మమకారాలచేత మానవుడు బంధింపబడుతున్నాడు. ఈ ప్రకృతి దృశ్యాలనుండి తన్ను తాను నిగ్రహించుకోటానికి దృష్టిని, శ్రవణాన్ని, జిహ్వను అదుపులో పెట్టుకోవాలి.

స్థూల, సూక్ష్మ, కారణాలకు చింతపండును ఉదాహరణముగా తీసుకోవచ్చును. పైన గుల్ల, లోన పండు. ఆ లోపల గింజ; అదే విత్తనము. చింతపండుమీద గుల్ల వంటిది దేహము. లోపలి పండువంటిది, మనస్సు. దానిలోని గింజవంటిది కారణ శరీరము. ఈ మూడింటి సమ్మిళిత స్వరూపము, మానవత్వము. దీనిలో అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలున్నాయి. అన్నమయకోశానికి మూడు గుణాలున్నాయి. ఆకలి, దప్పి, నిద్ర. ఈ మూడూ దేహ తత్త్వాలు. ప్రాణమయ కోశానికి మూడు గుణాలు వున్నాయి, ఉచ్ఛ్వాస శక్తి, నిశ్వాస శక్తి, చలన శక్తి. మనోమయ కోశానికికూడా మూడు గుణాలు వున్నాయి. అవి సంకల్ప, వికల్ప, మననాలు. అదే విధముగా మేధా, వివేక, విజ్ఞాన శక్తులు విజ్ఞానమయ కోశానికి గల మూడు గుణాలు. ఇక ఆనందమయ కోశము ప్రియమునుండి ప్రారంభమవుతుంది. ప్రియం, మోదం, ప్రమోదం ఈ మూడు ఆనందమయ కోశ తత్త్వాలు.

**ఆనందమును అనుభవించాలంటే ఇంద్రియములను నియమమార్గములో పెట్టాలి**

ప్రతి వ్యక్తి ప్రియం, మోదం, ప్రమోదం అనే మూడింటిని ఆశిస్తాడు. ఇష్టమైన వానిని చూచినప్పుడు కలిగేది ప్రియానందము. ఇష్ట వస్తు విషయానుభవము మోదం. ఇష్టమైన వ్యక్తితో, వస్తువుతో తాదాత్మ్య భావము పొందటము ప్రమోదము. ఒకడు తన కిష్టమైన మామిడిపండ్లు మార్కెట్టులోకి వచ్చాయని విన్నాడు. వెళ్లి చూడగానే ఆనందము కల్గినది. అది

sri sathyasai vahini amrutam

ప్రియం. వెంటనే డబ్బిచ్చి తీసుకున్నాడు. చేతిలో పట్టుకొని ఆనందిస్తున్నాడు. అది మోదం. ఇంటికి వెళ్లి చక్కగా కడిగి భుజించాడు. ఇది ప్రమోదం. 'నిత్యానందం పరమ సుఖదం' అని భక్తుడు భగవంతుని ప్రేమతో ప్రార్థిస్తాడు. లేక ఒక వ్యక్తిని చూడాలని ఆశిస్తాడు. చూచిన తక్షణమే ఆనందము కలుగుతుంది. సమీపించి అన్యోన్యముగా కలసి వుండటం, మోదం. అతనితో చేరి ఆనందము అనుభవించటము ప్రమోదము. ఆనందమునకు మూడు స్థాయిలు. స్వామి స్వప్నంలో కనుపిస్తే ఆనందము కలుగుతుంది. స్వప్నములో కనుపించిన స్వామి ప్రత్యక్షముగా వచ్చేసరికి మరింత ఆనందము కలుగుతుంది. 'ఏకత్వమే బ్రహ్మానందం'. అదే యోగానందం. అదే అద్వైతానందం. అదే ప్రేమానందం. ఆనందములో ఏకత్వము అమితమైన ఆనందము. ఈ ఆనందమును అనుభవించాలంటే యింద్రియములను నియమ మార్గములో పెట్టాలి.

ఇంద్రియాలను యే విధముగా అదుపులో పెట్టుకోవాలి? అన్ని ఇంద్రియాలకు మానసిక శక్తి ఆధారము. మనో చైతన్యము లేకుంటే యింద్రియాలు యే మాత్రము పని చేయలేవు. ఒక్కొక్క తూరి యింద్రియము పెడదారి పడుతుంది. ఉదాహరణకు, పింగాణి పాత్రను కర్రపుల్లతో కొడితే శబ్దము వస్తుంది. అనగా స్పందన ఏర్పడుతుంది. అలాంటి స్పందనచేతనే మనస్సు సుఖ దుఃఖాలను అనుభవిస్తుంది. మన మేధస్సుకూడా ఒక పింగాణి పాత్రవంటిది. దూషణతో మనస్సులో స్పందన యేర్పడుతుంది. తక్షణం ఆనందము దెబ్బ తింటుంది. ఉద్రేకము కలుగుతుంది. మనో నిగ్రహము కోల్పోయి కొట్లాటకు దిగుతాము. ఒక వ్యక్తి మనను గొప్పగా వర్ణిస్తాడనుకోండి. దాని ప్రభావము మనస్సుపైన పడుతుంది. మై మరచి ఆనందములో మునిగిపోతాము.

**మనస్సును బుద్ధితో చేరుస్తే ఉన్నతమైన విచారణలో మునిగిపోతుంది**

ఐతే దుఃఖములో, ఆనందములోకూడా విచక్షణా శక్తి క్షీణిస్తుంది. విచక్షణా శక్తి కోల్పోయినవానికి మంచి, చెడ్డ తెలియక మనస్సు పెడమార్గము పడుతుంది. మనస్సు స్థాన మెక్కడ ? మనస్సు క్రింద ప్రాణము, మనస్సు పైన బుద్ధి వుంటుంది. బుద్ధి అగ్ని తత్త్వము. ప్రాణముకూడా అగ్నితత్త్వమే! రెండింటికి మధ్యవున్నది, మనస్సు. మనస్సునకు అధిష్టాన

srisathyasaivachanamrutam

దేవత చంద్రుడు. చంద్రతత్త్వము జలమయము. పైన అగ్ని, క్రింద అగ్ని. ఇక్కడ ప్రాణము. అక్కడ బుద్ధి. రెండింటికి మధ్యన వుండి తబ్బిబ్బు పడిపోతుంది. అలలు అధికమైపోతాయి. అది జలమయమవుతుంది. పల్లమువైపు ప్రవహించటం జలస్వభావము. నీరు కొండపై పోసినా క్రిందకే పారుతుంది. అగ్ని గుంతలో పెట్టినా జ్వాల పైకి పోతుంది. అగ్ని ఉన్నత స్థాయికి పోతుంది, జలము క్రిందికి పోతుంది. నీటి తత్త్వము అధోస్థితికి పోవటమైతే అగ్ని తత్త్వము వున్నత స్థితికి పోవటము. మనస్సును బుద్ధితో చేరుస్తే వున్నతమైన విచారణలో మునిగిపోతుంది. కనుక, ఏ పని చేసినా, కొంచెం కాలము అధికమైనాకూడా బాగా విచారణ చేసి మరీ పనిలో ప్రవేశించాలి. విచారణ చేయకపోతే మనస్సు అనేక అవస్థలకు గురౌతుంది.

**ఆత్మ ఇంద్రియాలకు అతీతమై బుద్ధికి మాత్రమే గ్రాహ్యమైనది**

మనస్సు ప్రతి యింద్రియానికి అంతర్వాహినిగా ప్రవహిస్తూ వుంటుంది. నీవు నిద్రిస్తూ స్వప్నము చూస్తున్నావనుకో. స్వప్నములో మిత్రులను, తల్లితండ్రులను చూశావు. చూచిన దెవరు? కనులు. మరి, అవి మూసుకునే వున్నాయి కదా! నీవు స్వప్నములో మాట్లాడుతున్నావు. కానీ, నీ నోరు మూసుకునే వుంది. స్వప్నములో తల్లితండ్రులు చెప్పిన మాటలు బాగా విన్నావు. స్వప్నములో చూడటం, వినటం, మాట్లాడటం అన్నీ మనస్సు ప్రోద్బలముతోనే జరుగుతున్నాయి. స్వప్నములో మాట్లాడినదీ మనస్సే, విన్నదీ మనస్సే, చూచినదీ మనస్సే. కాబట్టి యింద్రియాలన్నీ ఉపేంద్రియాలేగాని స్వతస్సిద్ధమైన యింద్రియాలు కావు. మనస్సు, బుద్ధి, యింద్రియాలకు అతీతమైన స్థాయిలో ఒకటున్నది. అదే ఆత్మ, ఒక్కొక్క యింద్రియానికి ఒక్కొక్క పని. ఆ ఒక్క పని తప్ప ఆ యింద్రియానికి మరో పని చేయటానికి శక్తి లేదు. కన్ను చూపిస్తుందే గానీ వినలేదు. చెవులు వింటాయి గానీ చూడలేవు. నోరు మాట్లాడుతుంది గాని వినలేదు. ఒక్కొక్క యింద్రియానికి ఒక్కొక్క శక్తి మాత్రమే పరిమితమై వుంది. వీటికి అతీతమైనది, ఆత్మ. ఆత్మ చూస్తుంది, వింటుంది, మాట్లాడుతుంది. అన్ని శక్తులు వున్నాయి, ఆత్మకు. 'బుద్ధి గ్రాహ్య మతీంద్రియమ్' ఇంద్రియాలకు అతీతమైనది, బుద్ధికి మాత్రమే గ్రాహ్యమైనది.

**అహంకారమునకు రాగద్వేషములు, కవల బిడ్డలు**

ఇంద్రియాలు సకల రోగాలతో కూడుకొన్నవి. ఇవి సత్యతత్త్వాన్ని నిరూపించలేవు. నాలుక

వుంది. ఆరోగ్యముగా వున్నప్పుడు లడ్డు తీపి, పకోడి కారము, మందు చేదుగా వుంటుంది. ఒక్కొక్కటి ఒక్కొక్క రుచి. కానీ, మలేరియా జ్వరము వస్తే లడ్డూకూడా చేదు అవుతుంది. అది రోగముయొక్క దోషం. సత్యాన్ని అసత్యముగా నిరూపిస్తుంది. కనులు ఆరోగ్యముగావుంటే రంగులు స్పష్టంగా కనుపిస్తాయి. పచ్చకామెర్ల వ్యాధి వస్తే అన్నీ పచ్చగానే కనుపిస్తాయి. రోగ కారణముగా సత్యము అసత్యముగా రూపొందుతుంది. దేహములో వున్న యింద్రియాలన్నీ రోగములున్నవే! అయితే, నయముగాని రోగము మరొకటి వున్నది. అది అహంకారమనే రోగము. అది యింద్రియాలను మరింత విచ్చలవిడిగా సంచరింపచేస్తుంది. దీనికి ఏడు తత్త్వాలు. దేహము, కర్మ, రాగము, ద్వేషము, అజ్ఞానము, అవివేకము, అభిమానము. అహంకారమునకు రాగ, ద్వేషములు కవల బిడ్డలు. రాగద్వేషాలు కలిగినప్పుడు అనేక కర్మలు ఆచరిస్తాడు, మానవుడు. దూషణ, తిట్టటం, కొట్టటం యిత్యాది యేవేవో సంభవిస్తూ వుంటాయి.

**జన్మకు మూలకారణం కర్మ**

కర్మలద్వారా దేహము ఆవిర్భవిస్తుంది. జన్మకు మూలకారణం కర్మ. సరైన కర్మలు ఆచరిస్తే సరైన జన్మ పొందుతాము. కర్మచేతనే జన్మ. ఎట్టి జన్మమో అట్టి రాగద్వేషములు. రాగము భగవంతునిపైన వుంటే శాంత, సఖ్య, దాస్య, వాత్సల్య, మధుర, యిత్యాది అనేక రకముల భక్తి ఆవిర్భవిస్తుంది. శాంత భక్తిని అనుభవించినది, భీష్ముడు. 56 దినములు శరతల్పముపైన పరుండికూడా 'పుణ్యకాలము రావాలి, పరమాత్మ సన్నిధి లభించాలి,' అని ఎంతో సహనముతో క్లేశాన్ని అనుభవించాడు. ఇది శాంత భక్తి. సఖ్య భక్తికి ఉదాహరణ అర్జునుడు. అర్జునుడు యెంతసేపూ 'బావా! బావా!' అంటూ సఖ్యాన్నే అనుభవించాడు. దేహరీత్యా సంబంధము పెట్టుకున్నాడు, అర్జునుడు. దేహరీత్యా ఆలోచించినంతవరకు కృష్ణుడుకూడా అదే సంబంధము గలిగివున్నాడు. ఇంక, దాస్య భక్తికి హనుమంతుడు ఆదర్శము. నిరంతరము రామసేవ చేయటమే చింత అతనికి. ఒకానొక సమయములో రాముడు ప్రశ్నించాడు, హనుమంతుని : 'నీవు నన్నే విధముగా ప్రేమిస్తున్నావని'. హనుమంతుడు చెప్పాడు, "ప్రభూ! దేహరీతిగా మీరు ప్రభువులు, నేను దాసుణ్ణి. మానసికముగా మీరు బింబము, నేను ప్రతిబింబము. ఆత్మరీతిగా నీవే నేను. నేనే నీవు. ఈ విధమైన భావముతో నేను నిన్ను అనుభవిస్తున్నాను. దేహభ్రాంతి వుండేంతవరకు

srisathyasaivachanamrutam

నీవు ప్రభువువు, నేను దాసుడిని. నీ నీడనే నేను.” దాస్య భక్తిలో యీ బిగువు అధికముగా వుంటుంది.

**నిత్య జీవితంలో తాము చేసే ప్రతిపని కృష్ణార్పణము గావించి అనురాగ భక్తిని అనుభవించారు గోపికలు** అనురాగ భక్తికి ఆదర్శము గోపికలు. ఏ పని చేసినా కృష్ణనామముతో కాలము పవిత్రము చేసుకునే వారు. సర్వ కర్మలూ భగవత్ప్రీత్యర్థంగా భావించి చేసేవారు. ఏది చేసినా కృష్ణార్పణము. దానితో వారు చేసిన ప్రతి పనీ ఆరాధనగా రూపొందింది. నిత్య జీవితంలో కష్ట నష్టాలు, సుఖదుఃఖాలు అన్నీ అనుభవిస్తూ కృష్ణుని అనురాగ భక్తిని అనుభవించేవారు. ‘అత్తలు మొత్తుకున్న మరి భర్తలు కత్తులు నూరుచున్న’ – కృష్ణునితో మాట్లాడితే గొంతు కోసేస్తానంటాడు, భర్త. అయినప్పటికి కోపగించరు, ఎచటి కేగరు, భీతిలబోరు గోపికలు. పొత్తమునందు చిత్తరువువలె వున్నాడు, వారిలో కృష్ణుడు. కాగితమునుండి అచ్చు వేరుచేయటానికి వీలుకాదు. వారి హృదయములో ముద్రితమైపోయాడు. ముద్రితమైన బొమ్మను కాగితమునుండి వేరుచేయ వీలుకాదు. వారి భావములు కృష్ణమయమై పోయాయి, ఇది అనురాగ భక్తి. ఎడబాటు లేని భక్తి.

**వాత్సల్య భక్తికి యశోద ఆదర్శము**

వాత్సల్య భక్తికి యశోద ఆదర్శము. ఎన్ని విధములైన మహత్తులు, అద్భుతములు చూచినా కృష్ణుడు తన కొడుకే అని ఆమె భావము. నోటిలో పదునాలుగు లోకములను చూచికూడా యిదంతా నా భ్రమ, కృష్ణుడు నా కొడుకే అనుకునేది. ఒకసారి ఉద్ధవుడు మధురాపురినుండి వ్రేపల్లెకు వచ్చాడు. అతనిని అడుగుతుంది యశోద, ‘ఉద్ధవా! మా గోపాలుడు బాగున్నాడా?’ అని. ‘ఆ మధురాపుర విహారి కేమి తక్కువమ్మా, చక్కగా వున్నాడు’ అని చెప్పాడాయన. అప్పుడు యశోద ‘కాదు, మధురాపుర విహారిని గురించి నేను అడగలేదు. మా గోపాలుని గురించి అడుగుతున్నాను.’ అన్నది. ‘ఆ బృందావన సంచారి ఆనందముగా వున్నాడమ్మా,’ అన్నాడాయన మళ్ళీ. ‘ఆయన కాదయ్యా! మా గోపాలుని సంగతి నేను అడుగుతున్నాను’ అన్నదా తల్లి. ఒక్కొక్కరికి ఒక్కొక్క పేరుపైన అభిరుచి ఏర్పడుతుంది. కృష్ణుడు భగవంతుడని తెలిసికూడా మీరా ‘గిరిధర గోపాలా! గిరిధర గోపాలా!’ అని తప్ప అన్యమైన పేరు ఆమె వుచ్చరించలేదు.

sri sathyasai vachanamrutam

సక్కుబాయి 'రంగా, పాండురంగా!' అనేది, 'కృష్ణా!' అని మాత్రం అనలేదు. ఒక్కొక్కరు, ఒక్కొక్క పేరు ఎంపిక చేసుకుంటారు. ఐతే అన్ని నామములు ఒక్క నామములో లీనమయ్యేవే!

**రాధ, కృష్ణులంటే ప్రకృతి, పరమాత్ములే!**

ఇక రాధయొక్క తత్త్వము, మధుర భక్తి. ఆమెకు తాను వేరు, కృష్ణుడు వేరు కాదు. వారిద్దరికి అవినాభావ, అన్యోన్యాశ్రయ సంబంధము. క ృ ష ం ణ డ ం న ృ చ ో ట రాధ వుంటుంది, రాధ వున్నచోట కృష్ణుడు వుంటాడు. రాధాకృష్ణులంటే ప్రకృతి, పరమాత్మలే. కృష్ణుడు పరమాత్ముడు. రాధ ధరా. ధరా అంటే ప్రకృతి, matter. పరమాత్మ energy. ఈ రెండింటి సమ్మేళనమే మానవ జీవితము.

దేహము matter, పదార్థం. ఆత్మ energy, శక్తి. ఈ రెండూ చేరే వుంటాయి. మనస్సును ఆత్మకంటె భిన్నముగా భావించరాదు. ఇంద్రియాలవల్ల భిన్నత్వ మేర్పడుతుంది. కనుపించే దృశ్యమంతా ఒకానొక సమయములో మిధ్యగా మారేదే! కాని, దృష్టిమాత్రం ఒక్కటిగానే వుంటుంది. దృశ్యము, దృక్కు రెండింటిని వేరు చేయటమే నిజమైన సాధన. ఇదంతా ప్రకృతి. పరమాత్మ అంతర్వాహిని. ఈ రెండింటిని చేర్చి శక్తిని, యింద్రియ శక్తిని అనుభవిస్తున్నారు. కాబట్టి, సుఖదుఃఖాలకు గురైపోతున్నారు. కనుక, మొట్టమొదట మన యింద్రియములను వాంఛలనుండి తప్పించటానికి ప్రయత్నించాలి.

**ఏమి చూచినా మంచినే చూడాలి**

వాంఛలు లేకుండా జీవుడు వుండలేడు. కాని, మితమైన మార్గములో వీటిని అనుభవించాలి. నియమము లేకపోతే శ్రేయస్సుకు భంగము కలుగుతుంది. ఇంద్రియాలలో మూడు చాలా ప్రధానమైనవి. ఇందులో రెండు మరీ ముఖ్యమైనవి. కనుకనే భగవంతుడు అందరికి హెచ్చరిక చేస్తున్నాడు, "రెండు, చాలా బలమైనవి. కనుకనే వాటికి మూతలు వున్నాయి. వాటిని విచ్చలవిడిగా వినియోగించవద్దు" అని. కన్నులకు మూతలున్నాయి. అవసరము లేకపోతే మూసుకోవచ్చు. చెవులకు మూతలు లేవు. ముక్కుకు మూతలు లేవు. నోటికి మూత వున్నది. కనుక, మాటలు తగ్గించాలి. నాలుకను అదుపులో పెట్టుకోవాలి. కనులను అదుపులో



srisathyasai vachanamrutam

పెట్టుకోవాలి. ఈ రెండింటిని అదుపులో పెడితే మిగతా యింద్రియాలు సహజముగా అదుపులోకి వస్తాయి. కన్నులు చూచేకొలది, నోరు యిష్టము వచ్చినట్లు వాగుతుంది. నోరు చెప్పేకొద్దీ, కన్నులు చూడాలని ఆశపడుతూవుంటాయి. ఈ రెండూ చేరితే జీవితాన్ని భ్రష్టుపట్టిస్తాయి. కనుక యేమి చూచినా మంచినే చూడాలి.

విద్యార్థులారా! ఈ మూడు యింద్రియాలను అదుపులో పెట్టుకుంటే ఆనందము మీ స్వంతమవుతుంది. అందువలననే మంచిని చూడండి. మంచిగా తయారు కండి. మంచిగా మాట్లాడండి. మిత భాషగా వుండాలి. మితం హితం. సంభాషణ హితంగా వుండాలి, మితముగా వుండాలి.

**'అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియ హితంచయత్'**

జయదేవుడు నాలుకను వుద్దేశించి చెబుతాడు: "రసమెరిగిన ఓ నాలుకా! సత్యం, ప్రియం, హితం బోధించే నాలుకా ! పరమాత్మ తత్త్వాన్ని నాట్యమాడించే నాలుకా! నీవు సక్రమమైన మార్గాన్ని అనసరించు. అసత్యవాదము, అప్రియమైన మాటలు, వుద్రేక పూరితమైన పలుకులు పలుకవద్దు" అని. 'అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియ హితంచయత్' అన్నది, భగవద్గీత. భగవంతునికి ప్రీతికరమైనవి మూడు అసత్యాదులచేత దూషితము కానటువంటి నాలుక భగవంతునికి చాలా ఇష్టం. హింసాదులచే దూషితముకాని దేహముకూడా భగవంతునికి యిష్టము. రాగద్వేషాదులచే దూషితముకాని మనస్సు భగవంతునికి చాలా యిష్టం. ఈ మూడూ త్రికరణములు. మాటలలో యే అసత్యమైన రావచ్చు. కనుక, అధికముగా మాట్లాడకూడదని పూర్వము ఋషులు మౌనము విధించారు. ప్రియమైనవని, అసత్యమైన మాటలను వుచ్చరించకూడదు. ఊరిలో వుంటే యెవరినో కలువవలసి వస్తుంది. ఏదో మాట్లాడవలసి వస్తుంది. ఎందుకీ అవస్థలని అరణ్యానికి వెళ్లేవారు ఋషులు. అరణ్యములో మాటలకు అవకాశము లేదు. అక్కడ దూషణ, భూషణలు వినిపించే ఆస్కారము లేదు. చెడుదృశ్యాలు చూడవలసిన పరిస్థితి వుండదు. అరణ్యములో ప్రశాంతముగా కూర్చొని దివ్యమైన తత్త్వాన్ని యింద్రియాలలో వారు అనుభవించారు.

**దేహరక్షణకు ఆహారము, శీత నివారణకు వస్త్రము**

ఇంద్రియాలున్నవని యిష్టం వచ్చినట్లు వినియోగించకూడదు. ఇష్టము వచ్చిన

srisathyasaivachanamrutam

పదార్థాలనంతా మ్రింగకూడదు. ఆకలికోసం అన్నము తినాలి. రుచికోసం కాదు. దేహతత్త్వము అన్న పానీయాలపైన ఆధారపడి వుంది. ఆకలనే రోగానికి అన్నం మందు. చేదుమందు మలేరియాను తగ్గిస్తుంది. 'చేదుమందు వద్దు, తీపిమందు కావాల'నటం తప్పు. డాక్టరు దగ్గరకి వెళ్లి తీయనిమందు కావాలంటే యెట్లా! రోగం నివారణ కావాలి. అదే రీతిగా ఆహారము సాత్త్వికమైనదిగా వుండాలి. దేహరక్షణకు ఆహారము, శీత నివారణకు వస్త్రము. ఆకలి విరివిగా పెంచుకోకూడదు. కోరికలు పెరిగినకొద్దీ మనము బంధితులమైపోతాము. ఇంద్రియాలు కేవలం కృత్రిమమైనవి. గడియారం కీ యిస్తే నడచినట్లు మనస్సంచారమువల్ల, కోరికలను పెంచుకోవటం వల్ల, యింద్రియాలు తిరుగుతూ వుంటాయి. ఇవి యినుప రజను ముక్కలవంటివి. అయస్కాంతమును చూడగానే అటు యిటు కదులుతూ వుంటాయి. నిజానికి చైతన్యము అయస్కాంతములో వుందిగాని, యినుప ముక్కలలో లేదు. మనసే అయస్కాంతము. మనసే జాగ్రత స్వప్నసుషుప్తిలలో పనిచేస్తూ వుంటుంది. కానీ, కారణ స్థితిలో మాత్రం మనస్సు శూన్యమైపోతుంది. కారణస్థితే సమాధి స్థితి. భగవంతుని ఆనందాన్ని అనుభవిస్తుంటే మరి యే చింత వుండదు. అన్ని కోరికలు అణగిపోతాయి. కోరికలు అణగినప్పుడే ఆనందము చేకూరుతుంది. మనస్సున్నంతవరకు దుఃఖము తప్పదు. మనస్సును అదుపులో పెట్టినప్పుడే కొంతవరకు సంతోషం కలుగుతుంది. కనుక, ఆశలను తగ్గించుకోండి. ఆశలను తగ్గించుకోటానికి పనులు ఎక్కువగా చేయండి. తిని కూర్చోటంవలన మనస్సు విచ్చలవిడిగా సంచరిస్తుంది. ఆడుకోండి, పాడుకోండి. ఈ విధంగానైనా పనులలో మనస్సును ప్రవేశపెడితే వాంఛలు తగ్గిపోతాయి.

**(తేదీ. 13-03-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahamrutam